సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం । 5 । నవంబర్ । 2024



ముగిసిన సొసైటీ పదవీ కాలం

కేటీపీఎస్ కో ఆపరేటివ్ సొసైటీ పాలకవర్గ పదవీ కాలం ముగిసినందున కొత్త పాలకవర్గ ఏర్పాటుకు సహకార శాఖ దృష్టి సారించాల్సి ఉంది. 8లో



..పోలీసుల చేతివాటం ?

ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ల నుంచి పోలీసులు డబ్బు వసూలు చేస్తుండడంతో అక్రమ రవాణా పెరుగుతోందనే ఆరోపణలు వస్తున్నాయి. 8లో

గరిష్టం / కనిష్టం
31° / 20°

వాతావరణం

జిల్లాలో మంగళవారం ఉదయం ప్రారంభమైన ఎండ మధ్యాహ్నానికి తీవ్రమవుతుంది. రాత్రికి కొంతమేర చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

ఇళ్ల మంజూరులో పారదర్శకత

ఖమ్మంమయూరిసెంటర్: అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యేలా పారదర్శకంగా ఎంపిక చేపడుతామని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌరసంబంధాల, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని 59వ డివిజన్ దానవాయిగూడెంలో ఎస్‌డీఆర్ఎఫ్ నిధులు రూ.25 లక్షలతో నిర్మించనున్న డ్రెయినేజీ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం పేదలకు ఇళ్ల కేటాయింపును విస్మరించిందని.. తమ ప్రభుత్వం మాత్రం గ్రామసభల ద్వారా ఇళ్ల మంజూరుకు అర్హులను ఎంపిక చేయనుందని తెలిపారు. గతంలో నిర్మాణం ప్రారంభించి వదిలేసిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పనులు కూడా పూర్తిచేసి లబ్ధిదారులకు కేటాయిస్తామన్నారు. అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, ఆర్డీఓ నర్సింహారావు, కేఎంసీ ఈఈ కృష్ణలాల్, డీఈ మాధవిదేవి, ఏఈ కుమారస్వామి, శానిటరీ సూపర్‌వైజర్ సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్యూమరేటర్లు అప్రమత్తంగా ఉండాలి

- జెడ్పీ సీఈఓ చంద్రశేఖర్



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ చంద్రశేఖర్

చండ్రుగొండ : ఎన్యూమరేటర్లు అప్రమత్తతతో సమగ్ర సర్వే చేయాలని జెడ్పీ సీఈఓ కే.చంద్రశేఖర్ సూచించారు. అన్నపురెడ్డిపల్లి తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఎన్యూమరేటర్లకు శిక్షణ నిర్వహించారు. అనంతరం చండ్రుగొండ ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్యూమరేటర్లు ప్రతీ ఇంటికి వెళ్లి సర్వే చేయాలని, ఒక్కొక్కరు రోజుకు 10 కుటుంబాలను సర్వే చేయాల్సి ఉంటుందని అన్నారు. మూడు వారాల్లో ఒక గ్రామ సర్వే పూర్తి చేయాలని సూచించారు. సర్వేకు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు సహకరించాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో అన్నపురెడ్డిపల్లి, చండ్రుగొండ తహసీల్దార్లు జగదీశ్వర్ ప్రసాద్, సంధ్యారాణి, ఎంపీడీఓలు మహాలక్ష్మి, బయ్యారపు అశోక్, డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్న, ఎంఈఓ ఉండేటి ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థుల్లో సామర్థ్యాల పెంపునకు కృషి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్ తదితరులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి పాఠశాలల్లో చదివే విద్యార్థుల్లో సామర్థ్యాన్ని పెంచేందుకు, పోటీ తత్వాన్ని ఎదుర్కొనేందుకు కృషి చేస్తున్నామని, ఇందుకోసం ఒలంపియాడ్స్ ప్రవేశపెడుతున్నామని సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీ గుండా శ్రీనివాస్ తెలిపారు. దేశంలో ఒలంపియాడ్స్ నిర్వహించే ప్రముఖ సంస్థకు చెందిన ప్రతినిధి కె.శ్రీధర్‌తో కలిసి సోమవారం ఆయన ఒలంపియాడ్ ప్రణాళిక పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సింగరేణి వ్యాప్తంగా ఉన్న 9 పాఠశాలల విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దేందుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని వివరించారు. ఇందుకోసం కొత్తగూడెం, భూపాలపల్లి, శ్రీరాంపూర్ ఏరియాల్లోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో కమిటీ వేశామని చెప్పారు.

మద్యపాన నిషేధానికి ప్రతిజ్ఞ



బెల్లం పానకాన్ని ధ్వంసం చేయిస్తున్న మహిళలు

గుండాల: ప్రజల భవిష్యత్‌ను ఆగమ్యగోచరంగా మారుస్తున్న మద్యం అమ్మకాలను గ్రామంలో అడ్డుకుంటామని మహిళలు తీర్మానించారు. ఆళ్లపల్లి మండలంలోని అనంతోగుకు చెందిన మహిళలు సోమవారం సమావేశమయ్యారు. ఈసందర్భంగా మద్యం, సారా, చిగురు విక్రయించొద్దని తీర్మానించి, ఎవరైనా వ్యతిరేకిస్తే రూ.20 వేల జరిమానా విధిస్తామని తెలిపారు. ఈమేరకు మండల అధికారులు, పోలీసులు, గ్రామ యువత సహకరించాలని కోరారు. అనంతరం గ్రామంలో పలుచోట్ల బెల్లం పానకాన్ని గుర్తించి ధ్వంసం చేయించారు.

ఆది నుంచీ అదే తంతు..

అధికారుల ప్రణాళికా లేమి సీతారామ ప్రాజెక్టుకు శాపంగా మారింది. ప్రాజెక్టు ఎలా నిర్మించాలి, ఆయకట్టు ఏ విధంగా నిర్ణయించాలి, బరాజ్ నిర్మాణం ఎలా ఉండాలనే అంశాలపై తీసుకుంటున్న నిర్ణయాలు ఆది నుంచీ వివాదాలకు కేంద్ర బిందువుగా మారుతూనే ఉన్నాయి. తాజాగా డిస్ట్రిబ్యూటరీ కెనాళ్ల నిర్మాణ పనుల టెండర్ల అంశం వివాదాస్పదంగా మారింది.

– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం



నిలిచిపోయిన సీతారామ ప్రాజెక్ట్ పనులు (ఫైల్)

'సీతారామ'ను వెంటాడుతున్న నిర్లక్ష్యం

- శంకుస్థాపన చేసిన రెండేళ్లకు రీ డిజైనింగ్
- గోదావరి బ్యాక్ వాటర్‌పై తప్పిన అంచనాలు
- కొత్తగా ప్రధాన కాలువలో ఎస్కేప్ చానళ్లు
- బరాజ్ డీపీఆర్‌కు దక్కని అనుమతులు

ఇల్లెందు.. గల్లంతు..

రూ.7,926 కోట్ల అంచనా వ్యయంతో 2016లో సీతారామ ప్రాజెక్టు పనులకు శంకుస్థాపన చేశారు. ఇందులో 10 టీఎంసీల సామర్థ్యంతో ఇల్లెందు నియోజకవర్గ పరిధిలోని టేకులపల్లి మండలం రోళ్లపాడు వద్ద బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మించాల్సి ఉంది. శంకుస్థాపన చేసి, నిర్మాణ పనులు ప్రారంభించే సమయంలో కిన్నెరసాని అభయారణ్యం, రిజర్వ్ ఫారెస్ట్, రైల్వేట్రాక్‌లను సాకుగా చూపుతూ మొత్తం ప్రాజెక్టు డిజైన్‌ను మార్చేశారు. దీంతో సీతారామలో ఇల్లెందు గల్లంతయింది. ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.13,057 కోట్లకు పెరిగింది.

భారీగా పెరిగిన నిర్మాణ వ్యయం..

గోదావరిపై బరాజ్ నిర్మించిన తర్వాత బ్యాక్ వాటర్ ఎగువన గోదావరిలో కలిసే వాగుల్లోకి తిరిగి వెళ్లే అంశం ఆదిలోనే విస్మరణకు గురైంది. బరాజ్‌కు ఎగువన 54 కి.మీ. వరకు ఇరువైపులా కరకట్ట నిర్మాణ పనులు మొదలుపెట్టిన తర్వాత వాగుల అంశం తెరపైకి వచ్చింది. దీంతో వాగుల్లో ఎంత మేరకు కొత్తగా కరకట్టలు కట్టాలి, పంపుహౌస్‌ల అవసరం పడుతుందా ? అనే అంశాలపై దృష్టి పెట్టడంతో నిర్మాణ వ్యయం ఏకంగా రూ.19 వేల కోట్లకు పెరిగిపోయింది.

ఎస్కేప్ చానళ్లపై శ్రద్ధ లేకనే..

సీతారామ ప్రధాన కాలువకు గండ్లు పెట్టాల్సి రావడం ఇంజనీర్ల వైఫల్యానికి మరో ఉదాహరణగా నిలుస్తోంది. భారీగా వర్షపు నీటి వరద చేరడంతో పాల్వంచ – ములకలపల్లి మండలాల మధ్య ఇప్పటికే రెండు సార్లు, చండ్రుగొండ మండలంలో ఒకసారి గండి పెట్టాల్సి వచ్చింది. గండ్లు పెట్టకుంటే వరద నీరు పెరిగి పంపుహౌస్‌లకు ఇబ్బంది తలెత్తే పరిస్థితి ఉండడంతో తామే గండ్లు పెట్టామని ప్రాజెక్టు ఇంజనీర్లు చెప్పడం మరో విశేషం. ముర్రేడు, కిన్నెరసానిలపై భారీ అక్విడెక్టులు నిర్మించడంపై చూపిన శ్రద్ధ ఎస్కేప్ చానళ్లపై పెట్టకపోవడంతో మరోసారి అంచనా వ్యయం పెరిగినట్టయింది.

డీపీఆర్‌కు అనుమతులు ఎప్పుడు ?

సీతమ్మ సాగర్ పేరుతో దుమ్ముగూడెం – అశ్వాపురం మండలాల మధ్య గోదావరిపై నిర్మిస్తున్న బరాజ్ పనులు ఆగిపోయి ఏడాదిన్నర కావస్తోంది. బరాజ్, ప్రాజెక్టుల స్వరూప స్వభావాలు పదేపదే మార్చడం, కేంద్ర – రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయ లోపం తదితర కారణాలతో పర్యావరణ అనుమతులు రాలేదు. మరోవైపు ప్రభుత్వం చెల్లించే నష్టపరిహారంపై నిర్వాసితులు అసంతృప్తి వ్యక్తం చేస్తూ ముందుగా హైకోర్టును, ఆ తర్వాత నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. చివరకు ఎన్‌జీటీ ఉత్తర్వులతో బరాజ్ నిర్మాణ పనులు మధ్యలో ఆగిపోయాయి. ఇదే బరాజ్‌లో జల విద్యుత్ కేంద్రం ఉంటుందా? ఉండదా ? అనే అంశాలపై పూర్తి స్థాయిలో స్పష్టత లేదు.

తాజా వివాదం ఇలా..

ప్రధాన కాలువ వెంట 74 కి.మీ. వద్ద ఒక డిస్ట్రిబ్యూటరీ కెనాల్, 74 కి.మీ. నుంచి 98 కి.మీ. మధ్యన రెండో డిస్ట్రిబ్యూటరీ కెనాల్ నిర్మిస్తే 72 వేల ఎకరాల కొత్త ఆయకట్టు అందుబాటులోకి వస్తుంది. దీనికి 3,021 ఎకరాల భూసేకరణ చేయాల్సి ఉండగా, రూ.1,050 కోట్లు ఖర్చవుతుందని అంచనాలు వేశారు. అయితే పరిపాలన అనుమతులు లేకుండా వీటికి టెండర్లు పిలవడం ఇప్పుడు వివాదాస్పదం అయింది. టెండర్ల వివాదం అలా ఉంచితే ఏ మండలం, ఏ గ్రామం దగ్గర డిస్ట్రిబ్యూటరీ కెనాళ్లు వస్తాయి, ఎన్ని గ్రామాల్లో భూమిని సేకరిస్తారు, ఏ గ్రామాల పరిధిలో కొత్త ఆయకట్టు వస్తుందనే అంశంపై స్పష్టత లేదు.

వైభవంగా 'కార్తీక' పూజలు



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



శివుడికి భస్మాభిషేకం చేస్తున్న అర్చకులు

- శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు
- భద్రాద్రి రామయ్యకు ముత్తంగి అలంకరణ

భద్రాచలం: భద్రగిరి శివనామస్మరణలతో మార్మోగింది. కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానానికి అనుబంధంగా ఉన్న శ్రీ ఉమాసమేత రామలింగేశ్వర స్వామి వారి ఉపాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివుడికి భస్మాభిషేకం చేశారు. జ్యోతిర్లింగార్చన, ఆకాశ దీపోత్సవంతో శివాలయం దేదీప్యమానంగా వెలుగొందింది. రామాలయ పండితులు సన్యాసి శర్మ ప్రవచనం, లలితా సహస్ర నామార్చన, భక్తి, శాస్త్రీయ నృత్య కళాప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. రామాలయం తరఫున ఈవో రమాదేవి పూజల్లో పాల్గొన్నారు.

ముత్తంగి అలంకరణలో స్వామివారి దర్శనం..

శ్రీ సీతారామచంద్రస్వామి వారి మూలమూర్తులు ముత్తంగి అలంకరణలో దర్శనమిచ్చారు. ప్రతీ సోమవారం స్వామివారిని ఈ రూపంలో అలంకరించడం ప్రత్యేకత. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

ప్రజావాణిలో కలెక్టర్ జితేష్ వి పాటిల్



ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రజావాణిలో వచ్చిన ప్రతీ దరఖాస్తును నిశితంగా పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన దరఖాస్తులు స్వీకరించారు. పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వేణుగోపాల్, విద్యాచందనతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వినతుల్లో కొన్ని ఇలా..

- జూలూరుపాడు మండలం కొమ్ముగూడెం పంచాయతీలో గత కొన్ని నెలలుగా పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు అందడం లేదని, దీంతో వారు విధులకు రావడం లేదని, పంచాయతీ పరిధిలోని పాఠశాలలు, ఆస్పత్రులు దుర్వాసన వస్తున్నాయని ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు బానోత్ దుర్గాప్రసాద్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్ వెంటనే పారిశుద్ధ్య పనులు చేపట్టి నివేదిక అందజేయాలని జూలూరుపాడు ఎంపీడీఓను ఆదేశించారు. కాగా, కొత్తగూడెం మున్సిపాలిటీలో పాల్వంచ, లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి మండలాలు, ఇతర గిరిజన ప్రాంతాలను విలీనం చేస్తూ కార్పొరేషన్ ఏర్పాటు కోసం తీసుకవచ్చిన జీఓ 177ను తక్షణమే రద్దు చేయాలని కూడా విన్నవించారు.
- తాను కూలీ పనులు చేసుకుంటూ సారపాక సుందరయ్య నగర్‌లో 3.48 సెంట్ల ఇంటిస్థలం కొనుగోలు చేశానని, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని శ్రీరాముల సక్కుబాయి అనే మహిళ దరఖాస్తు అందించగా గృహ నిర్మాణ శాఖకు ఎండార్స్ చేశారు.

స్త్రీనిధి బీమాతో ఆర్థిక భరోసా

చుంచుపల్లి: రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాలకు ఉచితంగా రుణ బీమాతో పాటు ప్రమాద బీమాను కూడా అమల్లోకి తెచ్చిందని, వీటి ద్వారా మహిళా సంఘాల కుటుంబాలకు ఆర్థికంగా భరోసా ఉంటుందని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. సోమవారం ఐడీఓసీలో డీఆర్డీఏ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా స్త్రీనిధి జోనల్ మేనేజర్ శ్రీనివాసరావు రుణాలపై బీమా నమోదు చేసుకోవాలని, బీమా నమోదుకు అవసరమైన పత్రాలు, అనుమతులు తదితర వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలియజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. స్త్రీనిధి ద్వారా మహిళా సంఘాలకు ఇచ్చే రుణాలపై బీమా సౌకర్యం కల్పించడం ఉపయోగకరమన్నారు. రుణాలు తీసుకున్న మహిళలు మరణిస్తే వారు తీసుకున్న రుణాన్ని ప్రభుత్వమే చెల్లిస్తుందని తెలిపారు. అలాగే మహిళా సంఘాలకు కౌజు పిట్టలు, బాతులు, పుట్టగొడుగుల పెంపకం వంటి వాటిపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఐటీఐ విద్యార్థుల ద్వారా కౌజు పిట్టలు, తేనెటీగల పెంపకానికి అవసరమైన సామగ్రి తయారు చేయించవచ్చని చెప్పారు. మహిళా శక్తి యూనిట్లు బాతులు పెంపకంపై దృష్టి సారించాలని, తద్వారా అధిక ఆదాయం ఆర్జించవచ్చని తెలిపారు. జిల్లాలో దిగుబడి అయ్యే మునగకాయలను మహిళా సంఘాలు కొనుగోలు చేసి హైదరాబాద్ వంటి నగరాల్లో అమ్మితే అధిక లాభాలు వస్తాయని వివరించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ ఎం.విద్యాచందన, అదనపు డీఆర్‌డీఓ (సెర్ప్) నీలయ్య, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు ఉషారాణి, లీడ్ బ్యాంక్ మేనేజర్ రాంరెడ్డి పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణానికి అనుమతివ్వండి

అటవీశాఖ మంత్రి కొండా సురేఖకు తుమ్మల లేఖ

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలోని తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో మంజూరైన రోడ్ల నిర్మాణానికి అటవీ అనుమతులు ఇవ్వాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అటవీ శాఖ మంత్రి కొండా సురేఖకు సోమవారం లేఖ రాశారు. జిల్లాలో రోడ్లు, భవనాల శాఖ మంజూరు చేసిన ఎల్‌డబ్ల్యూఈ (తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల అభివృద్ధి) రోడ్ల పనులను లేఖలో వివరించారు. అటవీ అనుమతులు మంజూరు చేస్తే యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మారుమూల ప్రాంతాల అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం వద్ద పట్టుబట్టి నిధులు తీసుకొచ్చామని, రోడ్ల నిర్మాణంతో అభివృద్ధి సాధ్యమవుతుందని లేఖలో పేర్కొన్నారు. ఈ పథకం కింద 2018లో ఫేస్ 1, 2 కింద, 2022లో ఫేస్–3 కింద రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఈ నిధులతో చేపట్టిన రోడ్లు వివిధ దశల్లో ఉన్నాయని, కొన్ని పనులు అటవీ శాఖ అనుమతి లభించక పెండింగ్‌లో ఉన్నాయని, తక్షణమే వాటిపై దృష్టి సారించాలని కోరారు. ఈ రోడ్ల నిర్మాణంతో మారుమూల ప్రాంతాల్లో రవాణా వ్యవస్థ మెరుగుపడుతుందని వివరించారు. రహదారులు నిర్మిస్తే సుదూర ప్రాంతాల నుంచి ప్రజలు పర్యాటకాన్ని, ప్రకృతిని ఆస్వాదించేందుకు తరలివచ్చే అవకాశం ఉంటుందని, ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుందని తెలిపారు. జిల్లాలో మూడు విడతల్లో 68 రోడ్లు మంజూరయ్యాయని, వీటిలో 28 రోడ్ల పనులు పూర్తయ్యాయని, 26 రోడ్లు ప్రగతి దశలో ఉన్నాయని, ఆరు రోడ్లు తిరస్కరణకు గురయ్యాయని వివరించారు. ఇంకా 8 రోడ్లకు అటవీ శాఖ అనుమతి రావాల్సి ఉందని తెలిపారు.

రాష్ట్రస్థాయి క్రీడోత్సవాలకు 248 మంది

- ఉట్నూరులో పోటీలకు వెళ్లిన క్రీడాకారులు



కిన్నెరసాని వద్ద క్రీడాకారుల బస్సులను ప్రారంభిస్తున్న అధికారులు

పాల్వంచరూరల్: ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లో మంగళవారం నుంచి జరగనున్న రాష్ట్రస్థాయి గిరిజన క్రీడోత్సవాలకు భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని విద్యార్థులు 248మంది సోమవారం బయలుదేరారు. ఇందులో 124మంది బాలురు, 124 మంది బాలికలు ఉండగా.. వీరికి కిన్నెరసాని, కాచనపల్లి స్పోర్ట్ స్కూళ్లలో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఆయా శిబిరాల నుంచే బస్సుల్లో ఉట్నూరు బయలుదేరారని ఐటీడీఏ స్పోర్ట్స్ ఆఫీసర్ బి.గోపాల్‌రావు తెలిపారు.

ముగిసిన రాష్ట్రస్థాయి టీటీ పోటీలు



విజేతలతో క్రీడా, విద్యాశాఖ అధికారులు

కొత్తగూడెంఅర్బన్: జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆనందఖని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జరుగుతున్న అండర్ – 17 బాలబాలికల రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు సోమవారం రాత్రి ముగిశాయి. టీం చాంపియన్‌షిప్, వ్యక్తిగత అంశాల్లో జరిగిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని 10 ఉమ్మడి జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. టీం చాంపియన్‌షిప్ విభాగంలో హైదరాబాద్ బాలబాలికల జట్లు అద్భుత ప్రతిభ కనబరిచాయి. ద్వితీయ స్థానంలో రంగారెడ్డి బాలబాలికల జట్లు నిలవగా, బాలికల టీం చాంపియన్‌షిప్‌లో తృతీయ స్థానాన్ని ఖమ్మం జట్టు కైవసం చేసుకుంది. బాలుర విభాగంలో నిజామాబాద్ జట్టు తృతీయ స్థానాన్ని సాధించింది. వ్యక్తిగత బాలుర సింగిల్స్ విభాగంలో హైదరాబాద్‌కు చెందిన జతిన్ దేవ్ ప్రథమ స్థానంలో నిలవగా, తరుణ్ ద్వితీయ స్థానం సాధించాడు. తృతీయ స్థానాన్ని రంగారెడ్డి జిల్లాకు చెందిన ఆరుష్ రెడ్డి సాధించాడు. బాలికల వ్యక్తిగత సింగిల్స్ విభాగంలో హైదరాబాద్‌కు చెందిన శశిరిత ప్రథమ, శ్రేష్టారెడ్డి ద్వితీయ, చైత్రారెడ్డి తృతీయ స్థానంలో నిలిచారు. అనంతరం జరిగిన ముగింపు సభలో జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి ఎం. పరంధామరెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి ఎం. వెంకటేశ్వరాచారి విజేతలకు బహుమతులు అందజేశారు. జాతీయ స్థాయి పోటీలకు బాలుర విభాగంలో జతిన్‌దేవ్, తరుణ్, దేవాన్ష్‌సింగ్, రిషబ్‌సింగ్, ఆరుష్ రెడ్డి, స్టాండ్ బైలుగా కార్తీక్ తేజ, పి.జ్వలిత్ ఎంపికయ్యారు. బాలికల విభాగంలో డి.సుశ్రీత, సి.శ్రేష్టారెడ్డి, డి.చైత్రారెడ్డి, అవనిరెడ్డి ఎంపిక కాగా, సిరిచందన, నవ్యశ్రీ, ధరణి స్టాండ్‌బైలుగా ఎంపికయ్యారు. కార్యక్రమంలో పోటీల పరిశీలకులు మామిడి సంతోష్, జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి వాసిరెడ్డి నరేష్‌కుమార్, పామర్తి శ్రీనివాస్, సుధీర్, మంజుల, సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బౌద్ధక్షేత్రం అభివృద్ధికి రూ.2.50 కోట్లు



భవనాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఈ సరిత, అధికారులు

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని బౌద్ధక్షేత్రం అభివృద్ధికి రాష్ట్రప్రభుత్వం రూ.2.50 కోట్ల నిధులు మంజూరు చేసిందని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఎస్‌ఈ వెల్లడించారు. బౌద్ధక్షేత్రాన్ని సోమవారం సందర్శించిన ఆమె రూ.50 లక్షలతో నిర్మించిన విశ్రాంతి భవనాన్ని పరిశీలించారు. ఇక్కడ మిగిలిన పనులను పూర్తి చేయాలని ఆదేశించిన ఎస్‌ఈ, నూతనంగా చేపట్టే అభివృద్ధి పనులకు కేటాయించిన రెండు ఎకరాల స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం కేటాయించిన నిధులతో రెండెకరాల్లో పార్క్ ఏర్పాటుతో పాటు ఇతర పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఖమ్మం జిల్లా టూరిజం అధికారి బి.సుమన్ చక్రవర్తి, ఏఈ నాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయోగాలకు వేళాయె..

- సైన్స్‌ఫేర్‌కు సన్నద్ధమవుతున్న విద్యాశాఖ
- ఈనెల 18 నుంచి మూడురోజుల పాటు నిర్వహణ
- విద్యార్థుల్లో శాస్త్ర, సాంకేతిక విజ్ఞానం పెంచడమే లక్ష్యం
- వసతి, భోజన ఏర్పాట్లలో అధికారులు నిమగ్నం



ప్రయోగం చేస్తున్న విద్యార్థిని (ఫైల్)

కొత్తగూడెంఅర్బన్: అన్నపురెడ్డిపల్లిలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఈనెల 18, 19, 20 తేదీల్లో జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహణకు విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. శాస్త్ర, సాంకేతిక, పర్యావరణ, ఆరోగ్యం పట్ల విద్యార్థుల్లో ఆసక్తి, అభిరుచి కలిగించేందుకు ప్రతీ సంవత్సరం సైన్స్ యాక్టివిటీలు నిర్వహిస్తున్న విషయం విదితమే. ప్రతీ నవంబర్, డిసెంబర్ నెలల్లో స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్, హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో సైన్స్‌ఫేర్ ఏర్పాటు చేస్తున్నారు. గత రెండేళ్లుగా ఈ కార్యక్రమాన్ని 'రాష్ట్రీయ బాల్ వైజ్ఞానిక్ ప్రదర్శన (ఆర్‌బీవీపీ) ఫర్ చిల్డ్రన్స్' పేరుతో దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది సైన్స్‌ఫేర్‌లో 'సుస్థిర భవిష్యత్ కోసం శాస్త్ర సాంకేతిక రంగం' అనేది ప్రధానాంశంగా ఉంటుంది. ఇందులో మళ్లీ ఏడు ఉప అంశాలుగా రూపొందించారు. వీటి ఆధారంగానే విద్యార్థులు ఎగ్జిబిట్లను రూపొందించుకోవాల్సి ఉంటుందని జిల్లా విద్యాశాఖ అధికారులు తెలిపారు.

అంశాలు ఇవే..

సైన్స్‌ఫేర్‌లో ఆహారం, ఆరోగ్యం, పరిశుభ్రతతో పాటు రవాణా కమ్యూనికేషన్, సహజ వ్యవసాయం, విపత్తుల నిర్వహణ, నమూనాలు –గణన ఆలోచనలు, వ్యర్థాల నిర్వహణ, వనరుల నిర్వహణ అనే అంశాలు ఉన్నాయి. ఇవేకాకుండా విద్యార్థులకు సెమినార్ కూడా నిర్వహించనున్నారు. పోటీల్లో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొనే అవకాశం ఉంది. కాగా, సైన్స్‌ఫేర్‌లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా వసతి, భోజన ఏర్పాట్లు చేస్తున్నారు. 9, 10 తరగతుల విద్యార్థులను సీనియర్లుగా, 6,7,8 తరగతుల వారిని జూనియర్లుగా విభజిస్తారు. ప్రతి పాఠశాల నుంచి మూడుకు తగ్గకుండా, ఏడుకు మించకుండా ప్రాజెక్టులు ప్రదర్శించాల్సి ఉంటుందని, ఒక్కో గైడ్ టీచర్ మాత్రమే ఇన్‌చార్జ్‌గా హాజరు కావాలని అధికారులు సూచించారు.

18 కమిటీల ఏర్పాటు..

సైన్స్‌ఫేర్ విజయవంతానికి జిల్లాలోని ఉపాధ్యాయులతో 18 కమిటీలు ఏర్పాటు చేశారు. బాలికలకు అన్నపురెడ్డిపల్లి రెసిడెన్షియల్ పాఠశాల, కేజీబీవీల్లో, బాలురకు రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో వసతి కల్పించనున్నారు. బాలికలకు ఇన్‌చార్జ్‌లుగా మహిళా ఉపాధ్యాయులను నియమించనున్నారు. విద్యార్థులు ప్లేట్, గ్లాస్‌తో పాటు శీతాకాలం అయినందున బ్లాంకెట్లు కూడా తెచ్చుకోవాలని సూచించారు. ఈ ఏడాది పోటీలకు 500 పైగా ఎగ్జిబిట్లు వస్తాయని, 1700 నుంచి 2000 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు హాజరయ్యే అవకాశం ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. మూడు రోజుల సైన్స్ ఫేర్‌కు రూ.8 నుంచి 9 లక్షలు ఖర్చయ్యే అవకాశం ఉంటుందని, ఎస్‌సీఈఆర్‌టీ నుంచి రూ.50 వేలు మాత్రమే మంజూరయ్యాయని తెలిపారు. ప్రతి రోజు సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు, శాస్త్రవేత్తలతో ప్రసంగాలు, ఐటీడీఏ పాఠశాలలకు ప్రత్యేకంగా పోటీలు నిర్వహించనున్నారు.

సైన్స్‌ఫేర్‌కు ఏర్పాట్లు చేస్తున్నాం



అన్నపురెడ్డిపల్లిలో మూడు రోజుల పాటు జరిగే సైన్స్ ఫేర్‌కు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. బాలబాలికలకు వేర్వేరుగా వసతి సౌకర్యం కల్పిస్తాం. విద్యార్థులు, ఉపాధ్యాయులకు భోజనంతో పాటు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం.

– వెంకటేశ్వరాచారి, డీఈఓ

శాస్త్ర, సాంకేతిక విజ్ఞానం పెంచేందుకే..



విద్యార్థుల్లో శాస్త్ర, సాంకేతిక విజ్ఞానంపై ఆసక్తి పెంచేందుకు ప్రతి ఏడాది సైన్స్‌ఫేర్ నిర్వహిస్తున్నాం. జిల్లా స్థాయిలో గెలుపొందిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు పంపించి ప్రోత్సహిస్తున్నాం. విద్యార్థులతో ఎక్కువ సంఖ్యలో ఎగ్జిబిట్లు తయారు చేయించి, సైన్స్ ఫేర్‌లో పాల్గొనేలా ఉపాధ్యాయులు చొరవ చూపాలి.

– చలపతిరాజు, జిల్లా సైన్స్ అధికారి

క్లుప్తంగా

పారిశుద్ధ్యంపై ప్రచారం



ఐటీడీఏ రోడ్డులో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని వీధుల్లో ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయకుండా గ్రామపంచాయతీ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. చెత్త వేస్తున్న ప్రదేశాల్లో సోమవారం గాడిద బొమ్మతో కూడిన ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

ప్రైవేటు ఆస్పత్రి సీజ్



క్లినిక్‌ను సీజ్ చేస్తున్న అధికారులు

కొత్తగూడెంరూరల్: జిల్లా కేంద్రంలోని మధుర బస్తీలో నిర్వహిస్తున్న అర్షమొలల క్లినిక్‌ను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సీజ్ చేశారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పీఓ డాక్టర్ మధువరన్, డిప్యూటీ డెమో ఫైజ్ మొహియుద్దీన్, డాక్టర్ సుందర్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనుమతులు లేకుండా క్లినిక్ నిర్వహించడంతోపాటు అధిక మోతాదులో స్టెరాయిడ్స్ వాడతూ ఫైల్స్ సమస్యతో బాధపడుతున్న వారికి శస్త్ర చికిత్స చేస్తున్నట్లు గుర్తించారు. దీంతో ఆస్పత్రిని సీజ్ చేశారు. నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

బీసీ కమిషన్ పర్యటన వాయిదా

ఖమ్మంసహకారనగర్: ఖమ్మం కలెక్టరేట్‌లో మంగళవారం జరగాల్సిన బీసీ కమిషన్ సమావేశం వాయిదా పడిందని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సంస్థల్లో వెనుకబాటుతనం స్వభావం, తదితర అంశాలపై విచారణ చేపట్టి వినతులు స్వీకరించడానికి మంగళవారం కమిషన్ చైర్మన్, సభ్యులు వస్తారని తొలుత వెల్లడించారు. ఈమేరకు ఉమ్మడి జిల్లాకు సంబంధించి ఖమ్మం కలెక్టరేట్‌లో ఏర్పాట్లు చేస్తుండగా, కమిషన్ పర్యటన వాయిదా పడిందని కలెక్టర్ వెల్లడించారు. ప్రభుత్వం మళ్లీ షెడ్యూల్ ప్రకటించాక వివరాలు వెల్లడిస్తామని ఆయన తెలిపారు.

14 కిలోల గంజాయి సీజ్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ సత్యనారాయణ

ఇల్లెందు: ఇల్లెందు– కొత్తగూడెం రోడ్‌లో అన్నారం గ్రామం వద్ద సోమవారం వాహనాల తనిఖీ చేపట్టిన పోలీసులు కారులో తరలిస్తున్న 14 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించగా ఒడిశాకు చెందిన కోమల్ బిస్వాస్, రమేష్ మండల్‌లు ఒడిశా నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు తేలింది. నిందితులను అరెస్ట్ చేసినట్లు ఇల్లెందు సీఐ బత్తుల సత్యనారాయణ తెలిపారు. తనిఖీల్లో ఎస్‌ఐ నాగుల్ మీరాఖాన్, సిబ్బంది ఉన్నారు.

సీపీఐ నాయకుడి మృతికి సంతాపం

మణుగూరు రూరల్: మండల పరిధిలోని విజయనగరం గ్రామానికి చెందిన మాజీ ప్రజానాట్యమండలి కళాకారుడు, సీపీఐ సీనియర్ నాయకుడు తూముల రాజ్‌కుమార్ ఆదివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొల్లోజు అయోధ్య, మండల, పట్టణ కార్యదర్శులు జంగం మోహన్‌రావు, దుర్గ్యాల సుధాకర్‌లు సోమవారం మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో ఎస్‌కె సర్వర్, పాయం లక్ష్మయ్య, తూముల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.


వంట గ్యాస్ లీకై ఎగిసిన మంటలు

ములకలపల్లి: మండల పరిధిలోని పాత గంగారం శివారు డబుల్ బెడ్‌రూం ఇంట్లో సోమవారం గ్యాస్ లీకై మంటలు చెలరేగాయి. మడకం వనిత శేఖర్ ఇంట్లో మంటలు రావడంతో స్థానికులు ఉలిక్కిపడ్డారు. వంటింట్లోని గ్యాస్ సిలిండర్ నుంచి మంటలు వస్తున్నట్లు గుర్తించారు. మంటలు ఆర్పివేయడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఎస్సై కిన్నెర రాజశేఖర్ ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు.

గుడిసె దగ్ధం

నేలకొండపల్లి: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి పూరి గుడిసె కాలిపోగా నిరుపేద కుటుంబం కట్టుబట్టలు మిగిలింది. మండలంలోని మంగ్రాజుపల్లి తండాకు చెందిన పానుగోతు ఉపేందర్ కుటుంబంలో ఎవరూ లేని సమయాన గుడిసెకు సోమవారం ఉదయం షార్ట్ సర్క్యూట్‌తో నిప్పంటుకోగా స్థానికులు అగ్నిమాపక శాఖ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అయితే, గుడిసె గుట్టపై ఉండడంతో వాహనం చేరుకోలేకపోయింది. దీంతో గుడిసె పూర్తిగా కాలిపోగా రూ.25 వేల నగదు, రెండు క్వింటాళ్ల బియ్యం, టీవీ, బట్టలు, ఇతర సామగ్రి కాలిపోవడంతో కట్టుబట్టలతో మిగిలిన తమ కుటుంబాన్ని ఆదుకోవాలని ఉపేందర్ కోరాడు.

ముగిసిన కేటీపీఎస్ సొసైటీ పదవీ కాలం



పాల్వంచలో కేటీపీఎస్ కో ఆపరేటివ్ సొసైటీ కార్యాలయం

కొత్త పాలకవర్గం ఏర్పాటుకు మొదలుకాని ప్రక్రియ

పాల్వంచ: కేటీపీఎస్ కో ఆపరేటివ్ సొసైటీ పాలకవర్గ ఐదేళ్ల పదవీ కాలం సోమవారంతో ముగిసింది. కానీ కొత్త పాలకవర్గ ఏర్పాటుకు జిల్లా సహకార శాఖ చర్యలు చేపట్టడంలేదు. సొసైటీలో అధ్యక్షుడు, కార్యదర్శి, ట్రెజరర్, నలుగురు డైరెక్టర్లు ఉంటుండగా, గత కమిటీకి 2019 నవంబర్ 4న ఎన్నికలు నిర్వహించగా, 5న కొత్త పాలకవర్గం ఏర్పాటైంది. గత కమిటీలో 1535, టీఆర్‌వీకేఎస్, 327 యూనియన్ల నాయకులు ఎన్నికయ్యారు.

ఎన్నికలకు కసరత్తు చేపట్టని సహకార శాఖ

పాలకవర్గం ముగిసినా ఎన్నికల నిర్వహణను జిల్లా సహకారశాఖ పట్టించుకోవడంలేదు. ఈనెల 4వ తేదీతో గడువు ముగియగా, రెండు నెలల ముందు నుంచే ఎన్నికల కసరత్తు చేపట్టాల్సి ఉంది. జిల్లా సహకార శాఖ అధికారులు ఈ విషయమై ఆర్‌సీఎస్(రిజిస్ట్రార్ ఆఫ్ కోఆపరేటీస్)కు సమాచారం అందించాల్సి ఉంటుంది. ఓటర్ల జాబితా సిద్ధం చేయడం, బైలా కాపీల పరిశీలన, ఎన్నికల షెడ్యూల్ విడుదల, పోలింగ్ తదితర ప్రక్రియ నిర్వహించాల్సి ఉంది. కానీ ఈ విషయంలో ఒక్క అడుగూ ముందుకు పడలేదు.

ఐదేళ్లల్లో రెండు పాలకవర్గాలు

కేటీపీఎస్ సొసైటీలో ఐదేళ్ల కాలంలో రెండు పాలకవర్గాలు కొలువుదీరాయి. 2019లో ప్రెసిడెంట్‌గా దానం నర్సింహారావు, సెక్రటరీగా వల్లమల్ల ప్రకాష్, ట్రెజరర్‌గా మహేందర్, వైస్ ప్రెసిడెంట్‌గా నాగమణి, డైరెక్టర్‌లుగా ధర్మరాజుల నాగేశ్వరరావు, నూనావత్ కేశులాల్ నాయక్, రమణ ఎన్నికయ్యారు. అనంతరం కేటీపీఎస్ నుంచి సభ్యులుగా 400 మంది ఉద్యోగులు బదిలీ అయ్యారు. వారిలో సుమారు 170 మంది దామరచర్ల యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్(వైటీపీఎస్)కు వెళ్లారు. అయినా ఇక్కడే సొసైటీ సభ్యులుగా కొనసాగడంతో తమకు రుణ మొత్తం పెరగడం లేదని స్థానిక ఉద్యోగులు ఆరోపించారు. చివరకు ఇక్కడి నుంచి వెళ్లిన వారి సభ్యత్వాలు తొలగించాలని తీర్మానం చేశారు. అధ్యక్ష కార్యదర్శులుగా ఉన్న దానం నర్సింహారావు, వల్లమల్ల ప్రకాష్ సైతం బదిలీ కాగా, వారి సభ్యత్వాలు తొలగించాలని సర్వసభ్య సమావేశం నిర్వహించి తీర్మానం చేశారు. బైలాకు విరుద్ధంగా జనరల్ బాడీ సమావేశంలో కోరం లేకుండానే మినిట్స్ బుక్ బయటకు తీసుకెళ్లి సంతకాలు చేసి బదిలీ అయిన 400 మందిని తొలగించాలని కుట్ర చేశారని కొందరు ఉద్యోగులు ఆరోపించారు. ఈ విషయం తీవ్ర వాగ్వాదానికి దారితీసింది. ఈ క్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు గత ఏప్రిల్ 25న తమ పదవులకు రాజీనామా చేశారు. వీరు నాలుగు సంవత్సరాల 8 నెలలు పదవిలో ఉన్నారు. జూలై 1న కొత్త పాలకవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ధర్మరాజుల నాగేశ్వరరావు, సెక్రటరీగా కేశులాల్, ట్రెజరర్‌గా మహేందర్, వైస్ ప్రెసిడెంట్‌గా నాగమణి, మిగతా వారు డైరెక్టర్‌లుగా రెండో పాలకవర్గం ఏర్పాటైంది. సోమవారంతో ఐదేళ్ల గడువు ముగిసింది. కొత్త పాలకవర్గ ఎన్నికలో కావాలనే తాత్సారం చేయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇంకొంత కాలం ఈ కమిటీనే కొనసాగించాలని కొందరు పావులు కదుపుతున్నట్లు సమాచారం.

కొత్త కమిటీ ఏర్పాటుకు చర్యలు

కేటీపీఎస్ పాలకవర్గ పదవీకాలం ముగిసినట్లు ముందస్తుగా మా దృష్టికి రాలేదు. ఈ విషయాన్ని పరిశీలించి నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకుంటాం. అయితే గతంలోనే ప్రస్తుత ఓటర్ల లిస్ట్ కావాలని కోరాం.

–సయ్యద్ ఖుర్షీద్, జిల్లా సహకార అధికారి

భద్రాద్రి క్షేత్రానికి కార్తీక శోభ



గోదావరి నదీ హారతి సమర్పిస్తున్న అర్చకులు

- నదీస్నానాలకు భారీగా తరలివచ్చిన భక్తులు
- జనసంద్రంగా మారిన గోదావరి తీరం



గోదావరి తీరంలో పూజలు చేస్తున్న భక్తులు

భద్రాచలంటౌన్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన భద్రాచలానికి కార్తీకమాసం మొదటి సోమవారం సందర్భంగా భక్తులు భారీగా తరలివచ్చారు. వేకువజాము నుంచే పుణ్యస్నానాలు ఆచరించేందుకు వచ్చిన భక్తులతో గోదావరి తీరం సందడిగా మారింది. ఈసందర్భంగా మహిళలు గోదారమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి కార్తీక దీపాలను వదిలారు. అలాగే, నది ఒడ్డున తులసీ మొక్క నాటి ప్రత్యేక పూజలు చేశారు. ఆతర్వాత నదీ తీరంలోని శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, ఆంజనేయ స్వామి ఆలయాలతో పాటు రామాలయంలో పూజలు నిర్వహించారు. కాగా, వివిధ ప్రాంతాల భక్తులు భారీగా తరలిరావడంతో రామయ్య దర్శనానికి సమయం పట్టగా, రామాలయ పరిసరాలతో పాటు కరకట్టపై వాహనాలు బారులుదీరాయి. కాగా, కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని వైభవంగా నదీ హారతి కార్యక్రమం నిర్వహించారు.

బురదతో ఇక్కట్లు

గోదావరిలో కార్తీక మాసం సందర్భంగా పుణ్యస్నానాలు ఆచరించేందుకు వచ్చిన భక్తులు ఇక్కట్లు ఎదుర్కొన్నారు. తీరమంతా అడుగు తీసి అడుగు వేయలేని విధంగా బురద ఉండడంతో ఒకరి చేయి ఒకరు పట్టుకుని నడవాల్సి వచ్చింది. భక్తులు భారీగా వస్తారని తెలిసినా అధికారులు ఆ స్థాయిలో ఏర్పాట్లు చేయకపోవడంపై విమర్శలు వెల్లువెత్తాయి. గోదావరి స్నాన ఘట్టాల వద్ద భారీగా ఒండ్రు మట్టి పేరుకుపోయినా నామమాత్రంగా తొలగించడం.. పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులు తడిసిన బట్టలతోనే ఒడ్డుకు చేరడంతో తీరం చిత్తడిగా మారింది.



బురద కారణంగా చేయి పట్టుకుని వస్తున్న యువతులు

పాఠశాలల క్రీడా జట్ల ఎంపిక



ఉమ్మడి జిల్లా అండర్–17 రగ్బీ బాలుర జట్టు



పరుగుపందెం ఎంపిక పోటీల దృశ్యం

ఖమ్మం స్పోర్ట్స్: ఉమ్మడి జిల్లాస్థాయి అథ్లెటిక్స్, రగ్బీ అండర్–14, 17 జట్లను సోమవారం ఎంపిక చేశారు. జిల్లా పాఠశాలల క్రీడల సంఘం ఆధ్వర్యాన ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహించిన పోటీల్లో జట్లను ఎంపిక చేయగా, ఆయా జట్లు త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయని జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి కె.నర్సింహామూర్తి తెలిపారు. కాగా, అథ్లెటిక్స్ అండర్–14 బాలబాలికల రాష్ట్రస్థాయి పోటీలు ఖమ్మంలోనే జరగనున్నాయని వెల్లడించారు. ఎంపిక ప్రక్రియలో అథ్లెటిక్స్ కోచ్ ఎం.డీ గౌస్, పీడీలు షఫీక్ అహ్మద్, సుధాకర్, కృష్ణయ్య, జి.సైదేశ్వర్‌రావు, రవికుమార్, ముజాహిద్, నవీద్, శివ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

- **రగ్బీ జట్లు :** అండర్–14 బాలుర జట్టుకు జి.జగన్, కె.రుకిరాజ్, మనోజ్, అశ్రిత్, నందన్, వరుణ్, గణేష్, శ్రీహర్ష, పవన్‌కుమార్, కీర్తన బాబు, రాజేష్, పి.అఖిల్, భానుదీక్షిత్ ఎంపిక కాగా, బాలికల జట్టుకు జెస్సికా, వేదశ్రీ, కృతిక, జ్యోతిక, అఖిల, జలజ, భవాని, అమూల్య, వర్షిత, సౌజన్య ఎంపికయ్యారు. అలాగే, అండర్–17 బాలుర జట్టుకు ఎం.గోపీచంద్, ఎన్. వర్షిత్‌కుమార్, డి.నోము, ఎన్.చరణ్‌సాయి, ఎస్.సింధుకల్యాణ్, ఈ.ప్రశాంత్, టి.ప్రవీణ్, ఎస్.కే.సాజిత్, బి.వీరభద్రం, బాలికల జట్టుకు ఎస్.నందిని, బి.సునీత, పి.హిందు, డి.కావ్య, ఎం.ప్రణీత, ఎస్.వైష్ణవి, బి.సమీరా, సీహెచ్.సంజన, జి.నాన్సీ, వై.జోషిత, జి.శర్వాణి, బి.మానస, బి.కీర్తన ఎంపకియ్యారు.
- **అథ్లెటిక్స్ జట్లు :** అండర్–14 బాలుర జట్టుకు హెచ్.అభి, వి.చరణ్‌గౌడ్, బి.చందులాల్, బి.నరేష్, వి.శవిషకుమార్, ఎల్.అరుణ్, కె.అఖిల్, కె.విజయ్ రాణా, అరవింద్, డి.లోకేష్, ఎం.నితిన్, ఎం.వరుణ్, డి.మోహిత్, ఎల్.సందీప్, బాలికల జట్టుకు వైజశృతిహాసిని, రుధిక, డి.మధుప్రియ, ఎం.మాశ్రీక, పి.శిరీష, ఎస్.లక్ష్మీప్రియ, బి.పృధీక, కె.హన్సిత, ఎం.శాంతి, ఎం.భవిత, పి.సాయి స్రవంతి, డి.హారిక, ఎ. తషీకా ఎంపికయ్యారు. ఇక అండర్–17 బాలుర జట్టుకు ఎండీ.అష్రఫ్, సీహెచ్.వినయ్, సీహెచ్.నవదీప్, ఎస్.కే.ముబీన్, వి.రోహిత్, బి.పుల్లయ్యాచారి, వి.సాయి, జి.ప్రవీణ్, ఆర్.ప్రణయ్‌నాయక్, ఆర్.సన్నీ, కె.అక్షయ్‌రోహన్, జి.వెంకట్‌సాయి, కె.మస్తాన్, బి.ముఖేష్‌నాయక్, బి.లోకేష్, డి.సాయికుమార్, కె.ఆనంద్, బి.ఈశ్వర్, బి.నాగేంద్రబాబు, బి.విజయ్‌కుమార్, కె.ధనుంజయ్, బాలికల జట్టుకు ఎస్.కే.అమ్రిన్, బి.దివ్యసాయి, బి.రూప, ఎం.శ్రీవిద్యదొర, డి.చందన, జి.తేజశ్రీ, సీహెచ్.వేదశ్రీ, పి.కరుణ, బి.వాణి, ఎం.భవాని, డి.అమృత, ఎం.సాయిదీపిక, డి.భువనేశ్వరీ, బి.వేదర్షిణి, బి.ప్రసన్న, కె.సబిత, ఎ.మనుశ్రీ, బి.మన్విత, టి.నవీన, బి.ఆశశ్రీ, బి.దుర్గ, వి.వనిత, సీహెచ్.హాసిని ఎంపికయ్యారని వెల్లడించారు.

అత్తపై అల్లుడి దాడి

ఇల్లెందు: తరచూ కూతురిని కొడుతుండటంతో ప్రశ్నించిన అత్తపై అల్లుడు దాడి చేశాడు. ఈ ఘటనలో సోమవారం కేసు నమోదయింది. పోలీసుల కథనం ప్రకారం... మండలంలోని బాలాజీనగర్ పంచాయతీ ఆజాద్‌నగర్‌కు చెందిన మల్లెల సునీల కూతురు శ్రీదేవిని కామేపల్లి మండలం గోవింద్రాల బంజర గ్రామానికి చెందిన వంగూరి అరవింద్ ప్రేమ వివాహం చేసుకున్నాడు. కొంత కాలంగా భార్యతో ఘర్షణ పడి కొడుతుండటంతో ఆమె పుట్టింటికి వచ్చింది. ఈ నెల 3న రాత్రి మద్యం మత్తులో అరవింద్ అత్తగారింటికి వచ్చాడు. భార్యను కొడుతుండగా అడ్డు వెళ్లిన అత్తపై ఐరన్‌రాడ్‌తో దాడి చేశాడు. దీంతో ఆమెకు తీవ్ర గాయాలు కాగా చికిత్స అందిస్తున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రేషన్ షాపు సీజ్



వివరాలు వెల్లడిస్తున్న డీటీ మహేష్

కొత్తగూడెంఅర్బన్: పట్టణ పరిధిలోని రామవరంలో ఓ రేషన్‌షాపును పౌరసరఫరాల శాఖ అధికారులు సోమవారం సీజ్ చేశారు. 3031018 నంబర్ రేషన్‌షాపులో తనిఖీ చేయగా స్టాక్‌లో ఉండాల్సిన 19 క్వింటాళ్ల రేషన్ బియ్యం తక్కువగా ఉన్నాయని గుర్తించారు. దీంతో ఆ దుకాణాన్ని సీజ్ చేసి 6ఏ కేసు నమోదు చేశామని పౌరసరఫరాల శాఖ డీటీ మహేష్ తెలిపారు.

చేప పిల్లలు మృతి

దుమ్ముగూడెం : మండలంలోని సింగవరం, ఎస్.లక్ష్మీపురం గ్రామాలకు అధికారులు సోమవారం పంపిణీ చేసిన చేప పిల్లల్లో 20 వేల చేప పిల్లలు మృతి చెందినట్టు చేపల పెంపకందారులు గుర్తించారు. రాష్ట్ర మత్స్యశాఖ ఆధ్వర్యంలో మండలంలోని 37 గ్రామ పంచాయతీలకు భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు చేతుల మీదుగా లబ్దిదారులకు చేపల పిల్లలు అందించారు. కాగా మండల వ్యాప్తంగా ఒకేసారి పంపిణీ చేసే సమయంలో సమయాభావం కలగడంతోపాటు ప్యాకింగ్ సక్రమంగా చేయకపోవడంతో ఎండవేడికి తట్టుకోలేక మృతి చెందినట్టు మత్స్యకారులు తెలిపారు. అధికారులకు సమాచారం ఇచ్చామని పేర్కొన్నారు.

వీధికుక్కల దాడిలో గొర్రెపిల్లల హతం



మృతి చెందిన గొర్రె పిల్లలు

కారేపల్లి: కారేపల్లిలో వీధికుక్కలు బీభత్సం సృష్టించాయి. బొడ్రాయి బజార్‌కు చెందిన రాబోతు లాలయ్యకు చెందిన పది గొర్రె పిల్లలపై దాడి చేసి చంపివేశాయి. ఎప్పటిలాగే గొర్రెపిల్లలను దొడ్డిలో వదిలేసిన లాలయ్య మిగతా జీవాలను సోమవారం ఉదయం మేతకు తీసుకెళ్లాడు. ఆతర్వాత దొడ్డిలోకి ప్రవేశించిన కుక్కలు దాడి చేయడంతో పది పిల్లలు చనిపోయాయి. సాయంత్రం వచ్చాక గుర్తించిన లాలయ్య తనకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరాడు. ఇదిలా ఉండగా బొడ్రాయి బజార్‌లో 20రోజుల క్రితం జంగా మధుకు చెందిన 21 గొర్రెలు, ఈనెల 2న యర్నాగి సతీష్‌కు చెందిన ఏడు గొర్రె పిల్లలను కుక్కలు చంపేయడం, ఇప్పుడు మరో ఘటన జరగడంతో గొర్రెల కాపరులు ఆందోళన చెందుతున్నారు.

బాల్‌బ్యాడ్మింటన్ ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక



పోటీలకు హాజరైన క్రీడాకారులతో పీడీలు

బోనకల్: రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీల కోసం ఉమ్మడి ఖమ్మం జిల్లా పురుషులు, మహిళల జట్లను ఎంపిక చేసినట్లు బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి బొంతు శ్రీనివాసరావు, క్రీడల ఆర్గనైజర్ అమరేసి లింగయ్య తెలిపారు. ఈనెల 3, 4వ తేదీల్లో బోనకల్ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబర్చిన పది మంది పురుషులు, పది మంది మహిళలతో జట్లను ఎంపిక చేశామని వెల్లడించారు. ఈ జట్లు 8వ తేదీ నుంచి హనుమకొండ జిల్లా కేంద్రంలో జరిగే 70వ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయని తెలిపారు. కాగా, ఎంపిక పోటీల పరిశీలకుడిగా టి.శేషగిరి వ్యవహరించారు.

పెట్రోలింగ్ పోలీసుల చేతివాటం..?

- ఇసుక ట్రాక్టర్ల నుంచి రాత్రి వేళ భారీగా వసూళ్లు
- అక్రమాల నివారణలో విఫలమవుతున్న అధికారులు



మొర్రేడు వాగు వద్ద ఇసుక ట్రాక్టర్లు (ఫైల్)

పాల్వంచ: ఇసుక అక్రమ రవాణాకు పెట్రోలింగ్ పోలీసులే ఆజ్యం పోస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. విధుల్లో ఉన్నవారు ఒక్కో ఇసుక ట్రాక్టర్‌కు రూ.500 చొప్పున వసూళ్లకు పాల్పడుతున్నారు. కొందరు ఫోన్ పే ద్వారా నగదు ట్రాన్స్‌ఫర్ చేయించుకుంటున్నారు. విధుల్లో లేకపోతే అడ్డాలు, ట్రాక్టర్ యజమానుల ఇళ్లకు వెళ్లి మరీ డబ్బులు వసూళ్లు చేస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. మద్యం, బిర్యాని పొట్లాలను డిమాండ్ చేస్తున్నారు. లేదంటే ట్రాక్టర్లను పట్టుకుని స్టేషన్‌కు తరలిస్తారు. ఒక వేళ ఎస్‌ఐలు, సీఐలు తనిఖీ వస్తే పెట్రోలింగ్ విధుల్లో ఉన్నవారు ముందస్తుగానే ఇసుక ట్రాక్టర్ల యజమానులకు సమాచారం అందిస్తూ ఇన్‌ఫార్మర్లుగా వ్యవహరిస్తున్నారు. పై అధికారులకు మామూళ్లు ఇవ్వాలంటూ రాత్రి వేళ విధులు నిర్వహించే కానిస్టేబుళ్లు వసూళ్లకు పాల్పడుతుండటం గమనార్హం. మొర్రేడు పరీవాహక ప్రాంతాలు, గుడిపాడు, పాత పాల్వంచ, కుంటినాగులగూడెం తదితర ప్రాంతాల నుంచి ఇసుక ట్రాక్టర్లు అధిక సంఖ్యలో తిరుగుతున్నాయి. అయినా సిబ్బంది చేతివాటాన్ని అధికారులు కట్టడి చేయకపోవడం పలు విమర్శలకు దారి తీస్తోంది. ఫారెస్ట్ సిబ్బంది సైతం ఇదే రీతిలో చేతివాటం ప్రదర్శిస్తున్నారు.

దృష్టి పెడతాం



అక్రమ ఇసుక రవాణాలో సిబ్బంది పనితీరుపై దృష్టి పెడతాం. అక్రమాలకు పాల్పడితే తగిన చర్యలు తీసుకుంటాం. కట్టుదిట్టంగా విధులు నిర్వహించేలా చూస్తాం. అక్రమ ఇసుక రవాణాను అడ్డుకుంటాం.

–సుమన్, పట్టణ ఎస్‌ఐ

పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యేలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాందాస్, పక్కన ఇల్లెందు ఎమ్మెల్యే కనకయ్య

కారేపల్లి: ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ పరిధిలో కారేపల్లిలోని శ్రీలక్ష్మి ప్రియ కోటెక్స్ జిన్నింగ్ మిల్లులో ఏర్పాటుచేసిన సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని వైరా, ఇల్లెందు ఎమ్మెల్యేలు మాలోతు రాందాస్‌నాయక్, ఎమ్మెల్యే కోరం కనకయ్య సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు తమ ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. అర్హులందరికీ రుణమాఫీ వర్తిస్తుందని, ఈ విషయంలో అధైర్యపడాల్సిన అవసరం లేదన్నారు. కాగా, సీసీఐ అధికారులు తేమ శాతం పేరుతో రైతులను ఇబ్బంది పెట్టకుండా మద్దతుతో పత్తి కొనుగోలు చేయాలని సూచించారు. అనంతరం కారేపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ చెక్కులు పంపిణీ చేశారు. వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి నరేష్‌కుమార్, ఎంపీడీఓ సురేందర్, ఎంపీఓ రవీంద్రప్రసాద్, తహసీల్దార్ సంపత్‌కుమార్, ఏఓ అశోక్‌కుమార్, సొసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు, కాంగ్రెస్ నాయకులు పగడాల మంజుల, తలారి చంద్రప్రకాశ్, అడ్డగోడ ఐలయ్య, సురేందర్ మణియార్, ఇమ్మడి తిరుపతిరావు, పెద్దబోయిన ఉమాశంకర్, మేదరి టోనీ వీరప్రతాప్, దేవ్లానాయక్, బానోతు రామ్మూర్తినాయక్, ధరావత్ వినోద్‌కుమార్, గుగులోతు భీముడు, ధారావత్ భద్రునాయక్, ఎండీ.యాకూబ్ అలీ, హనీఫ్, మేదరి రాజా, షఫీ, షేరు, తాజుద్దీన్, నాగవేణి పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి



సత్యం (ఫైల్)

పాల్వంచరూరల్: అనుమానాస్పదస్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని రాజాపురం గ్రామానికి చెందిన కోరం సత్యం(45)వ్యవసాయ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం కిన్నెరసానిలోని గిరిజన గురుకుల కళాశాల వెనుక భాగంలోని కాలువ (ఒర్రె)లో పడి మృతిచెందాడు. ఆదివారం రాత్రి డబ్బుల కోసం భార్య ఆదిలక్ష్మితో గొడవ పడ్డాడు. తాను మణుగూరుకు వెళ్లి వచ్చే సరికి తన భర్త కాలువలో పడి మృతి చెంది ఉన్నాడని ఆదిలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

ద్విచక్రవాహనం పైనుండి పడి ఒకరు..

ఖమ్మంరూరల్: మండలంలోని తరుణి హాట్ సమీపాన ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనం పైనుంచి పడిన వ్యక్తి మృతి చెందాడు. సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం మండలం ఉర్లుగొండకు చెందిన కైరోజు వైకుంఠాచారి(44) తన భార్య ఈశ్వరమ్మతో కలిసి ఆదివారం ఏదులాపురంలో జరుగుతున్న ఫంక్షన్‌కు బయలుదేరాడు. ఈక్రమంలో తరుణీ హాట్ వద్ద కోతుల గుంపు అడ్డు రావడంతో సడెన్ బ్రేక్ వేయగా ఇద్దరు బైక్ పైనుంచి ఎగిరి కింద పడ్డారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన వైకుంఠాచారిని ఖమ్మం ప్రభుత్వాస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడని సీఐ ముష్క రాజు తెలిపారు.

కారు ఢీకొని యువకుడు..

ఖమ్మంరూరల్: ఎం.వెంకటాయపాలెం వద్ద బైక్‌ను కారు ఢీకొట్టడంతో కాచిరాజుగూడేనికి చెందిన పి.సాయికిరణ్(23) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. సాయికిరణ్ ఆదివారం బంధువు వద్ద బైక్ తీసుకుని ఖమ్మం వెళ్తుండగా కారు ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలుకాగా ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. కేసు నమోదు చేసినట్లు సీఐ ముష్క రాజు తెలిపారు.

వరకట్న వేధింపుల కేసు నమోదు

భద్రాచలం అర్బన్: భద్రాచలం పోలీస్‌స్టేషన్‌లో సోమవారం వరకట్న వేధింపుల కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం... పట్టణంలోని శాంతి నగర్ కాలనీకి చెందిన దుర్గాభవానికి 2015లో దుర్గాప్రసాద్ అనే వ్యక్తితో వివాహం జరిగింది. కాగా గడిచిన రెండేళ్లుగా దుర్గాప్రసాద్ అదనపు కట్నం కోసం భార్యను మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురిచేస్తున్నాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ పీవీఎన్ రావు కేసు నమోదు చేశారు.